ప్రజాశక్తి
ఆదివారం 27 ఆగస్టు 2023 5 అనంతపురం

సమస్యలపై స్పందించండి

మంత్రికి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని మంత్రి ఉషశ్రీ చరణ్ స్పందించి ప్రభుత్వంతో మాట్లాడాలని సిపిఎం కోరింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం నాడు మంత్రికి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుపుతూ లేఖ రాశారు. వర్షాభావంతో ఎండిపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని, విద్యుత్ కోతలను నివారించాలని, జిల్లాలో తాగునీటి పథకం కార్మికుల సమ్మెను పరిష్కరించాలనే తదితర సమస్యలను ప్రస్తావించారు. అనంతపురం జిల్లాలో మరోసారి కరువుఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. పంటలు చేతికందక గత నెల రోజులుగా మూడు రోజులకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వార్తలు రావడం ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు సహాయకచర్యలు చేపట్టాలని కోరారు. పంటల ఖర్చు ఆధారంగా కనీసం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. వర్షాభావం వల్ల విత్తనం వేయలేని రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను రెండు వందల రోజులకు పెంచాలన్నారు. విద్యుత్ కోతలను ఆపి, వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాలన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్యసాయి, శ్రీరామిరెడ్డి మంచినీటి పథకాల కార్మికులు సమ్మెలో ఉన్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి వారితో సమ్మెను విరమింపజేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ లాంటి చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేయించాలన్నారు. ఇక జిల్లాలోని ఏకైకసాగునీరు వనరుగా ఉన్న తుంగభద్ర హెచ్ఎల్సీ కెనాల్‌ను ఆధునీకరించాలన్నారు. హెచ్ఎల్సీని ఆధునీకరణకు నిధులు కేటాయించడంతో పాటు నిర్ధిష్ట గడువు నిర్ణయించి పనులు పూర్తి చేయాలన్నారు. హెచ్ఎల్సీ ఆయకట్టు కింద పంటల సాగుకు ఈ సంవత్సరం ప్రణాళికను ప్రకటించాలని కోరారు. హంద్రీనీవా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలన్నారు. అందుకు అవసరమైన పంట కాల్వలు తవ్వడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు. రాగులపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి గతంలో నిర్ణయించిన కాలువను తవ్వి తద్వారా వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల గ్రామాలకు సాగునీరు అందివ్వాలని రాంభూపాల్ కోరారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి

మూడుగంటల్లో ముగిసింది..!

◆ ముక్తసరి చర్చతోనే జెడ్పీ సాధారణ సమావేశం ◆ ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే మాత్రమే హాజరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తీవ్రమైన కరువు పరిస్థితులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ముక్తసరి చర్చలతోనే ముగిసింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం రెండు గంటల్లోపు ముగిసింది. అంటే మూడు గంటల్లో జిల్లా స్థాయి సమస్యలపై చర్చ ముగియడం గమనార్హం. ఎప్పటిలాగానే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీల హాజరు నామమాత్రంగానే ఉంది. మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఈ సమావేశంలో రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వైద్యం, గృహ నిర్మాణం, స్త్రీ శిశు సంక్షేమం, వ్యవసాయం ఈ నాలుగు అంశాలపైనే చర్చ జరిగింది. ఇందులో ప్రధానంగా ఎక్కువగా గృహ నిర్మాణంపైనే చర్చ జరిగింది. గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను ఎంపిపిలు, జడ్పిటిసిలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు తెలియకుండానే రద్దు చేసారని వాటిని మంజూరు చేయాలని బెళుగుప్ప, ఉరవకొండ ఎంపిపిలు కోరారు. దీనిపై కలెక్టర్ గౌతమి స్పందిస్తూ ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యమైనదని చెప్పారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసినా చాలా మంది

సమావేశంలో పాల్గొన్న ఎంపిపిలు, జెడ్పీటీసీలు (ఎమ్మెల్యేలు రాక ఖాళీగా ఉన్న ముందు కుర్చీలు)

లబ్ధిదారులు కట్టుకోవడానికి ముందుకు రావడం లేదని చెప్పారు. దీంతో కేంద్ర నుంచి వచ్చిన నిధుల వినియోగంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఇప్పుడు నడుస్తున్న ఇళ్లు త్వరితగతిన నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించి ముందుకు నడిపితే మరిన్ని ఇళ్లు మంజూరు చేయించడానికి ఇబ్బంది లేదన్నారు. వైద్య శాఖపై జరుగుతున్న చర్చలో ఓడిసి, రొద్దం మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాలు ఆగిపోయాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సత్యసాయి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి స్పందిస్తూ సాంకేతిక సమస్యతో నిర్మాణాలు ఆగిపోయాయని చెప్పారు. రోడ్లు భవనాల శాఖ నిర్మాణాలు చేపడుతోందన్నారు. సమస్యలు తెలుసుకుని పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

జిల్లాలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ సమస్యలపై చర్చించేందుకుగానీ, అధికారులకు మార్గ నిర్దేశాలు ఇచ్చేందుకు జెడ్పీ సమావేశం ఎంతో కీలకం. అలాంటి సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీ హాజరయ్యారు. మంత్రి కూడా సమావేశం

ఒక మంత్రి...ఒక ఎమ్మెల్యేనే హాజరు

ముగియడానికి గంట ముందుగా మాత్రమే వచ్చారు. అంతకు మునుపు నుంచి ఉన్నది మాత్రం అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒక్కరే. ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన ఒక్కరే ఈ సమావేశంలో ఉన్నారు. తక్కిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఏ ఒక్కరూ హాజరవలేదు. జిల్లాకు సంబంధించి జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్ర సరిహద్దుల్లోనున్న రొళ్ల మండలానికి సరైన అధికారులే లేరని రొళ్ల ఎంపిపి ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు

అధికారులే లేరు.. అభివృద్ధి ఎలా :రొళ్ల ఎంపిపి

ఎంపిడిఒగా వచ్చేవారు కూడా లేరని అన్నారు. ఇప్పుడున్న ఎంపిడిఒ పగలే మద్యం సేవించి కార్యాలయంకు వస్తారని తెలిపారు. అటువంటి వ్యక్తితో ఏ విధంగా పనిచేయించుకోగలమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంచి అధికారులను తమకు నియమించాలని కోరారు.

కరువుపై నామమాత్రపు చర్చ..!

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితుల గురించి రెండు జిల్లాల వ్యవసాయాధికారులు నివేదికను సమావేశంలో తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యలేమైనా తీసు కుంటున్నారా అని సభ్యులు అడిగిన ప్రశ్నకు అధికారులు స్పందిస్తూ ఇప్పటికే ప్రత్యామ్నాయ విత్తనాలను ఇచ్చేందుకు సిద్ధం చేసామన్నారు. వర్షాలు లేకపోవడంతో ఆ విత్తనం తీసుకునేందుకు కూడా రైతులు ముందుకు రావడం లేదని తెలిపారు. కరువు మండలాలు ప్రకటించాలని కూడేరు జడ్పిటిసి అడిగారు. దానికి ఇంకా సమయం ఉందని, సెప్టంబరులోనూ ఇదే విధంగా ఉంటే నివేదికను ప్రభుత్వానికి పంపుతామని వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నా ఆ సమస్యపై ఈ సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, జాయింట్ కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో కేతన్ గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, జెడ్పీ డిప్యూటీ సీఈవో లలితాబాయితో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, ఎంపిపిలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

మంత్రి ఉషశ్రీచరణ్

జెడ్పీ సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉషాశ్రీచరణ్ సూచించారు. ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీలకు ప్రహరీ ఎక్కడ అవసరమవుతాయో పరిశీలన చేయాలన్నారు. ఎక్కడెక్కడ అద్దె గదుల్లో కేంద్రాలు నడుస్తున్నాయో గుర్తించి సంబంధిత సిడిపిఓల ద్వారా వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ఐసిడిఎస్ పీడీకి పంపించాలన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ఉమ్మడి జిల్లాని అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.20 కోట్ల కేటాయించి తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు, తదితర అభివద్ధి పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే అనంత

నాడు, నేడు కింద ప్రభుత్వం పిహెచ్‌సిలు, ఆస్పత్రుల్లో చేపట్టిన అభివద్ధి పనులు, వచ్చిన మార్పులు, ఏరియా ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది నియామకం గురించి ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధికారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్లోని జూన్, జూలై నెలలో ఏఏ రకాల పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు, ప్రస్తుతం ఏ రకమైన పంటలు సాగు చేయాలి అనే వివరాలను అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు, కార్మికులు

వేతనాలు చెల్లించకుంటే

పూట గడిచేది ఎలా..?

◆ న్యాయం చేసే వరకూ తాగునీటి పథకాల కార్మికుల సమ్మె
◆ సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులు

ప్రజాశక్తి-ఉరవకొండ

నెలనెలా వేతనాలు చెల్లించకుంటే సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలు ఎలా గడవాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, పిఎఫ్, గ్రాట్యూటీ మంజూరు చేయాలని కోరుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేసే కార్మికుల సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో దాదాపు 600 మంది కార్మికులు 12 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. అయితే వారికి సకాలంలో జీతాలు, పీఎఫ్‌లు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 18 రోజులుగా కార్మికులు శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. చివరిగా కార్మికులు సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జిబిసి నుంచి తిమ్మాపురానికి తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని ఎన్.తిమ్మాపురం ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా గుంతకల్లు బ్రాంచి కెనాల్ వద్ద మోటార్లు అమర్చి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు. నీటి సరఫరాను పలువురు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, సర్పంచి సుశీలా ఉమాశంకర్, ఉపసర్పంచి పార్వతిరాముడు, వైసిపి నాయకులు ఉమాశంకర్, సునీల్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, లచ్చప్ప, విరుపాక్షి, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురానికి వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం

సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు - ఎస్ఎఫ్ఐ సంగ్రామ సైకిల్ యాత్రకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు విమర్శించారు. జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ సైకిల్ యాత్రకు శనివారం ఉరవకొండలో సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు తాండివిస్తున్నాయన్నారు. ముఖ్యంగా తాగునీరు, నాణ్యమైన భోజనం, మరుగుదొడ్ల సదుపాయం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల నుంచి కాస్మోటిక్ ఛార్జీలను పెండింగ్‌లో పెట్టడంతో నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. వర్షాలకు నీరు గదుల్లోకి వస్తూ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఇంటర్ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా ఇప్పటిదాకా పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోగా రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేమని స్వయానా విద్యాశాఖ మంత్రి ప్రకటన చేయడం దౌర్భాగ్యమన్నారు. అలాగే విద్యార్థినులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, ఈవ్‌టీజింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి సొంత భవనం కేటాయిస్తానని చెప్పి స్థలాన్ని ప్రకటించి ఇప్పటిదాకా సొంత భవనం కాంపౌండ్ వాల్ కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. వెంటనే సెంట్రల్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కరించాలని సైకిల్ యాత్ర అనంతరం ఈనెల 30న అనంతపురంలో భారీగా ముగింపు సభను ఏర్పాటు చేసి నినదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా సహాయ కార్యదర్శి సిద్దార్థ్, జిల్లా అధ్యక్షుడు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు రజిత, సునీత, తరిమెల గిరి, శివ, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ సంగ్రామ సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులు

కణేకల్లు : మండల కేంద్రమైన కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర నాల్గవ రోజైన శనివారం కణేకల్లుకు చేరింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ కణేకల్లు పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, గురుకుల, కెజిబివిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు కళాశాలల్లో నత్తనడకన జరుగుతున్న నాడు-నేడు అసంపూర్తి పనులను పూర్తి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వాలు విద్యార్థుల సౌకర్యాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి రమేష్, రజిత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వెంకటేశులు, గిరి, శివ, భీమా, నంద, సునీత, వివేక్, మాదేశ్, నందన్, నరసింహులు, హరికృష్ణ, మండల సిఐటియు నాయకులు నాగరాజు, షర్మాస్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా తయారవ్వాలి

జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా పారిశ్రామిక వేత్తగా తయారు కావాలని జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ సెమినార్ హాలులో కోఆర్డినేటర్ జి.మమత అధ్యక్షతన ప్రపంచ పారిశ్రామిక వేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిక జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం విద్యార్థులు అభ్యశించే విభాగంలో సబ్జెక్ట్ నైపుణ్యంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామిక వేత్తలుగా తయారుకావాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి కె.రాజశేఖర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, భువన విజయ, బి.ఓం ప్రకాష్, కళ్యాణి రాధా, ఎం.అంకారావు, కె.ఎఫ్.భారతి, బి.షహీనా, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'అనంత'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రిరూరల్

తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెద్దపొలమడ, చిన్నపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసి ఎండిన పత్తి, కొర్ర, ఉద్ది, ఆముదం, కంది, వేరుశెనగ, తదితర పంటలను ఎపి రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు రాక పంటలు సాగు చేసిన పంటలు ఎండిపోతుంటే రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. మరోవైపు 9.15 లక్షలు హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 6 లక్షల హెక్టార్లులోపే సాగైందన్నారు. సాగు చేసిన పంట కూడా ఎండిపోతున్నాయన్నారు. కావున ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి కరువుసహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.50వేలు, సాగు చేయకుండా దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతాంగానికి ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు పెసర, ఉలవలు, సజ్జ, ఆముదం, జొన్న, అనుములు, కొర్రలు, తదితర విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి జి.రాజారామిరెడ్డి, నాయకులు యుగంధర్, శిరీషా, రైతులు సూర్యనారాయణయాదవ్, ఆదినారాయణ, లక్ష్మీరెడ్డి, శేఖర్, మల్లికార్జున, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండు దశకు చేరుకున్న పంటను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

సోదనపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సోదనపల్లిలో వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సోదనపల్లిలో వైద్యాధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేసి స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో డెంగీ వ్యాధితో చిన్నారి భువిత మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులు మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఉదయమే గ్రామానికి చేరుకున్న వైద్యసిబ్బంది స్థానికుల వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శి రాయుడు, ఎంపిహెచ్‌ఒ మల్లికార్జున, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంఎల్‌హెచ్‌పి అరుణ, వనిత, ఆశాకార్యకర్తలు పద్మావతి, లక్ష్మీదేవి, మాధవి, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా ప్రాజెక్టు కార్మికులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

దండన తప్పదా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంటే ఏవిధంగా ఉంటుందో తెలియజేసే ఘటన జిల్లాలో చోటు చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎన్నికల విధులంటే ఇప్పటి వరకూ ఏముందిలే అనుకుని సాదాసీదాగా తీసుకునే వారికి ఇప్పుడు జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన, భయాన్ని సృష్టించే విధంగా ఉంటున్నాయి. ఈవారంలో వరుసగా ఇద్దరు జిల్లాస్థాయి అధికారులపై వేటు పడింది. ఓటర్ల జాబితాలో నుంచి ఓట్లను తొలగించే అంశాన్ని ఇది వరకూ లాగానే వారు కూడా ఆశామాషీగా తీసుకున్నారు. కింది స్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదిక ఆధారంగా సంతకాలు చేసేశారు. తీరా చూస్తే ఇప్పుడు వారు కూడా శిక్ష అనుభవించక తప్పని పరిస్థితి నెలకొంది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఈ రకమైన పరిస్థితిని అధికారులు ఎదుర్కొన్న దాఖలాల్లేవు. ఏదైనా ఉంటే బూత్ లెవల్ అధికారుల వరకే చట్టపరమైన చర్యలు ఉండేవి. ఇప్పుడు జిల్లాస్థాయి అధికారులకు కూడా అవి తాకడంతో అందరిలోనూ గుబులు రేగుతోంది. గతంలో లాగా ఎన్నికల విధుల్లో అశ్రద్ధగా ఏ మాత్రం వ్యవహరించినా వేటు పడక తప్పదన్న హెచ్చరిక అయినట్టయింది. జిల్లలో గత వారంలో వరుసగా ఇద్దరు జడ్పి సిఇఒలు సస్పెన్షన్‌కు గురయ్యారు. అంతక మునుపు మొత్తం ఎనిమిది మంది బూత్ లెవల్ అధికారులపై వేటు పడింది. వీరు చేసిందల్లా పూర్తిస్థాయి విచారణ లేకుండానే ఆరు వేల ఓట్లను తొలగించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వెళ్లడంతో దర్యాప్తు చేపట్టి చర్యలకు ఉపక్రమించింది. ఇప్పుడు సస్పెన్షన్ ప్రాథమిక విచారణలో భాగమేనని చెబుతున్నారు. అసలు విచారణ రాబోయే రోజుల్లో ప్రారంభమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారులుగా ఉన్న తహశీల్దార్ల వరకూ వచ్చే అవకాశమున్నట్టు చర్చ నడుస్తోంది. ప్రస్తుతం కేవలం బూత్‌లెవల్ అధికారులు, ఆపైన ఎలక్ట్రోరల్ అధికారుల వరకే వెళ్లింది. పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితే మరింత మందిపైకీ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓట్ల తొలగింపుపై సీరియస్‌గానే దృష్టి సారించినట్టు కనిపిస్తోంది. ఇక ఈ వారంలో అవినీతి నిరోధక శాఖ సైతం అధికారులపై వేటు వేసింది. కూడేరు మండల వ్యవసాయాధికారి రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబట్టాడు. అంతక మునుపు సబ్ రిజిస్ట్రారు కూడా లంచం తీసుకుంటూ పట్టుబట్టారు. ఇలా ఎన్నికల సంఘం ద్వారా వేటుపడింది కొందరికైతే... అవినీతికి పాల్పడుతూ ఎసిబికి చిక్కడం రెండు ఘటనలు జరిగాయి. ఉద్యోగంలోనున్న వారు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేసినా ఇబ్బందులు ఎదుర్కొనేది మాత్రం తామేనన్నది తెలుసుకోవాలని ఇది సూచిస్తోంది. ఈ వారంలో కరువుపైనా పెద్ద చర్చ జరుగుతోంది. మూడేళ్ల తరువాత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ సమస్య సైతం దానికి తోడైంది. వ్యవసాయానికి విద్యుత్ కోతలుంటుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నాడు 14 మండలాల్లో సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా చేపట్టారు. ప్రకృతి వైపరీత్యంతో పంటలు ఎండిపోతుంటే, విద్యుత్ సమస్యతో మరో రకంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసామని చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

పుట్లూరు : అప్పులు బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కందికాపుల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కందికాపుల గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు తలారి రాజేంద్రప్రసాద్ (22) తన తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో కుటుంబ పోషణ తనపైనే భారం పడింది. దీనికితోడు మూడు సంవత్సరాలుగా పత్తి పంట సాగు చేస్తూ నష్టపోయాడు. ఈనేపథ్యంలో అప్పులు ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం తోటలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి : పట్టణంలో మట్కా నిర్వాహకులపై దాడులు నిర్వహించి 9 మందిని అరెస్టు చేసి రూ.3,30,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ హమీద్ ఖాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి కేంద్రంగా పరిసర ప్రాంత గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సిబ్బందితో కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మట్కా నిర్వహిస్తున్న తాడిపత్రిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కొలిమి ప్రతాప్, పట్టణంలోని జయనగర్ కాలనీకి చెందిన కొమ్మ రాజకుల్లాయప్ప, శివాలయం వీధికి చెందిన షేక్ చాంద్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా, గాంధీ కట్ట ప్రాంతంలోని ఉదయగిరి మాబున్నీ, యల్లనూరు మండలం కోడుమూర్తి గ్రామానికి చెందిన గొంది మల్లికార్జున, తుమ్మంపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డి, కోడమండ్లపల్లి గ్రామానికి చెందిన ఉసోల్ల మహేష్, పుట్లూరు మండల కేంద్రానికి చెందిన నల్ల ఓబన్నను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.330950 నగదు, 18 మట్కా చీటీలు, 9 బాల్ పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

అనంతపురం సిటీ : అనంతపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద నాగలక్ష్మి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇటుకలపల్లికి చెందిన నాగలక్ష్మి తన స్థలాన్ని బావ కుమారులు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమణించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత స్థలం మహిళా భర్త పేరు మీదే ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

'సత్యసాయి' కార్మికులకు 'ఆలం' సంఘీభావం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బి.పప్పూరు పంప్ హౌస్ వద్ద సమ్మె చేస్తున్న సత్యసాయి నీటి పథకం కార్మికులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసా నాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆలం సోదరులు మాట్లాడుతూ ప్రభుత్వం నీటి పథకాలను విస్మరిస్తోందన్నారు. వెంటనే బడ్జెట్‌లో నిధులు కేటాయించి కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా సత్యసాయి నీటి సరఫరా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పిట్టు రంగారెడ్డి, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, జిల్లా మైనారిటీ ఉపధ్యక్షుడు జాఫర్, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి రాజన్న, తెలుగు యువత చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కుళ్లాయప్ప, పప్పూరు గ్రామ టిడిపి నాయకులు సుధాకర్, సత్తి, గుత్తా నాయుడు, నాని, జయరాం, వెంకటేష్, పెద్దుల నాయుడు, తిరుపతయ్య, వెంకటరాముడు, అంజనరెడ్డి, చక్రవర్తి, మహేష్, హరీష్, గణేష్, గంగానాయుడు, గోవర్ధన్, టిడిపి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బెట్ట నుంచి వేరుశనగను కాపాడుకోవాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి పంటను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో కోరారు. అయితే నేడు చిరుజల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 37.4-38.0 డిగ్రీల సెల్సియస్,కనిష్ట ఉష్ణోగ్రత 24.7-25.3 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. వాయువ్యం దిశగా గాలులు గంటకు 8-12 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 63-67 శాతం, మధ్యాహ్నం పూట 30-38 శాతం ఉంటే అవకాశం ఉందన్నారు. కావున వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, ఇతర పంటలను కాపాడుకునేందుకు పొటాషియం నైట్రేట్ (13:00:45) ఏ5 గ్రా లేదా (19:19:19) మూడు 19 ఎరువు లేదా యూరియా ఏ 10 గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయభాస్కర్

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని కొరపాడు గ్రామంలో చేపట్టిన జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఇఒఆర్‌డి దామోదరంతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం దయ్యాలకుంటపల్లిలో సామాజిక తనిఖీ బృందం గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న గ్రామసభకు హాజరై ప్రతిపనినీ క్షుణంగా పరిశీలించాలన్నారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు నిర్వహిస్తున్న పాల వెల్లువ, రైతుల రిజిస్ట్రేషన్ సర్వే, సిటిజన్ ఔట్రీస్ సర్వేలపై డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోపి పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ నార్పల మండలం ముగేతిమ్మంపల్లికి చెందిన వినోదం లక్ష్మయ్య, సతీమణి సాయికీర్తి కుటుంబ సభ్యులు వారి కుమారుడు మహంత్ రాయల్ పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నదానానికి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కళ్ల అద్దాలు పంపిణీ

పెద్దపప్పూరు : మండల పరిధిలోని పిహెచ్‌సిలో జిల్లా సివిల్ సర్జన్ డా.సైదన్న ఆదేశాల మేరకు వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 190 మందికి అద్దాలు పంపిణీ చేయడంతోపాటు నేత్ర ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒ మధుసూదనరాజు, వైద్యాధికారి ఉషారాణి, సూపర్‌వైజర్ షర్మస్‌వలి, లక్ష్మీకుమారి, సిహెచ్‌ఒ భారతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ మేయర్ మృతి బాధాకరం

అనంతపురం : మాజీ డిప్యూటీ మేయర్ బండి శ్రీరాములు హఠాన్మరణం బాధాకరమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శ్రీరాములు మృతిచెందిన విషయం తెలుసుకున్న టిసి వరుణ్ శనివారం ఉదయం ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

శ్రీరాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

GOOTY MUNICIPALITY - EXPRESSION OF INTEREST

Roc.No: EOT/2023-24/E1 DATED:26.08.2022

Expression Of Interest is invited from the Registered Private firms/Govt./Firms/Non. Governmental Organizations having past experience having of similar nature of works and Financial Capability to undertake " D P R of Construction of New Municipal Office Building in Gooty Municipality"

- Start Date for Receipt of Applications :28.08.2023 - 10.00 AM
- Last Date of Issue of Schedules :29.08.2023 - 4.00 PM
- Last Date for Receipt of bids :30.08.2023 - 4.00 PM
- Opening of Bids :30.08.2023 - 5.00 PM

Schedule cost RS.1000/- and EMD Rs. 2000/-.
For Conditions & other details contact Phone No: 9100986899. During office working hours

Commissioner,
Gooty Municipality.

టిటిడి పాలక మండలి సభ్యుడు అశ్వర్ధనాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన సి.అశ్వర్థనాయక్‌ను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా శాలువాలు కప్పి, బొకేలో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అశ్వర్థనాయక్ మాట్లాడుతూ గిరిజనులకు తొలిసారిగా టిటిడి బోర్డు సభ్యులుగా ఎన్నుకోవడం బంజారా జాతికే గర్వకారణంగా ఉందన్నారు. తనకు కలిగిన పదవి గిరిజన జాతికే కలిగినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. గిరిజన పక్షపాతిగా సిఎం జగన్ నిలిచారన్నారు. ఇందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబూనాయక్, ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణనాయక్, రాష్ట్ర నాయకులు రంగ్లానాయక్, బాలానాయక్, ఎస్‌కె.రామచంద్రానాయక్, నారాయణనాయక్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులునాయక్, కిరణ్‌నాయక్, పూజారి శ్రీనివాస్ నాయక్, సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.

అశ్వర్ధనాయక్‌ను సన్మానిస్తున్న ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు

ఎమ్మెల్యే 'అనంత'ను కలిసిన అశ్వర్ధనాయక్

టిటిడి పాలకమండలి సభ్యులుగా నియమితులైన అశ్వర్ధనాయక్ శనివారం అనంతపురంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశ్వర్థనాయక్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

దీర్ఘకాలంగా నెలకొన్న భూవివాదాలను పరిష్కరించి యజమానులకు స్థిరాస్తులపై శాశ్వత హక్కులు కల్పించడమే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శనివారం మండలంలోని నిదనవాడలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ కులమతాలు, పార్టీలకతీతంగా పని చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భూమి ఎవరి పేరు మీద ఉంటుందో.. ఎవరైతే సాగులో ఉంటారో వారికే శాశ్వతంగా హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దస్థాయిలో సర్వే చేయలేదన్నారు. ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా, అక్రమాలకు తావు లేకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉచితంగా భూహక్కు పత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ పత్రాలు ఇప్పటి వారికే కాకుండా భవిష్యత్తు తరాలవారికీ కూడా చాలా ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిపి యోగేశ్వరి, సర్పంచి శ్యామలమ్మ, ఎంపిటిసి సునితమ్మ, వైసిపి మండల మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల సర్వేయర్ గోవిందరాజులు, వీఆర్వో పెద్దన్న, నారాయణరెడ్డి, రామాంజనేయులురెడ్డి, వెటర్నరీ రామాంజనేయులు, పెద్దిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా రైతుకు భూశాశ్వత హక్కు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

మదర్‌థెరిసాకు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

సంఘ సేవకురాలు మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని శనివారం గుత్తిలోని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల భవన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు నారాయణరెడ్డి, విజయలక్ష్మి, దుర్గమ్మ, దేవా కృపమ్మ, గోవిందప్ప, విజయభాస్కర్, నారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నేటి యువత మదర్‌థెరిస్సాను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని జెవివి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు కేటి రంగప్రసాద్ అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవకు నిలువెత్తు రూపం మదర్‌థెరిస్సా అన్నారు. దేశంలోని సాధారణ రోగులతోపాటు కుష్టు రోగులను ఆదరించి వారికి ప్రేమను పంచిన మహోన్నత వ్యక్తి థెరిస్సా అన్నారు. అలాంటి ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపిహెచ్‌ఇఒ, మైనార్టీ మండల అధ్యక్షుడు హాజీ పట్టా కాజాపీరా, సామాజిక కార్యకర్త బెంజిమెన్, ఉపాధ్యాయులు ధనుంజయ, అశోక్‌కుమార్, శ్రీనివాసులు, భాగ్యరేఖ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల వ్యాప్తంగా పత్తిపంటను సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ డిడిఎ మద్దిలేటి సూచించారు. శనివారం మండలంలోని మిడుతూరులో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పత్తిపంట మూడు మాసాలు అవుతున్నందున పూత, పిందె, కాయ దశల్లో ఉందన్నారు. ఈనేపథ్యంలో ఇప్పటికే గులాబీ రంగు పురుగు ఆశించిందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నందున బెట్టను తట్టుకునేలా మందులు వాడాలన్నారు. ఇందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎడిఎ వెంకటరాముడు, గుత్తి, పెద్దవడుగూరు ఎఒలు శ్రీనివాసులు మల్లీశ్వరి, ఎఇఒ రజనీ, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఘనంగా కలర్స్ డే

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సోదనపల్లి ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో కలర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు కలర్స్ బెలూన్లతో పాఠశాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఎస్.ముజీనా మాట్లాడుతూ కలర్స్ డే సందర్భంగా తన సొంత ఖర్చులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు ఉత్సాహవంతులైన విద్యార్థులతో రంగురంగుల కలర్లతో బొమ్మలు గీయించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

కలర్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

టిటిడి సభ్యుడిగా సీతారామరెడ్డి నియామకంపై హర్షం

ఉరవకొండ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా తన సోదరుడు వై.సీతారామిరెడ్డిని నియమించడం పట్ల ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి కుటుంబం పట్ల నమ్మకం ఉంచి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకు సిఎం జగన్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. టిడిపి బోర్డు సభ్యుల నియామకంలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చోటు కల్పించి సామజిక న్యాయాన్ని పాటించిన జగన్ బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్ మూల విగ్రహానికి సువర్ణ కిరీటం, వెండి కవచం అలంకరించి వేదమంత్రాలతో కుంకుమార్చన, తమలపాకుల పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు తెలిపారు. మూడు ఆంజనేయస్వాముల దర్శనార్థం వచ్చే భక్తుల కోసంప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి నరసింహారెడ్డి తెలిపారు

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలో ప్రసిద్ధి గాంచిన మురిడి ఆంజనేయస్వామిని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా నరసింహస్వామి గరుడ వాహనోత్సవం

రాయదుర్గం రూరల్ : శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గరుడ వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యంస్వామి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్య పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి గురురాఘవేంద్ర, కోశాధికారులు నరసింహులు, అకౌంటెంట్ వెంకటేశులు, సభ్యులు గురునాథ్‌రెడ్డి, కమలాక్షుడు, రామి రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహులు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను రూపుమాపుదాం

కళ్యాణదుర్గం : వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను రూపుమాపుదామని ఆర్‌డిటి సిబిఒ కో-ఆర్డినేటర్ భాస్కర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌డిటి ఎఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో శనివారం మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం 7వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్‌బాబు మాట్లాడుతూ మండలంలోని రైతులతో ఏర్పాటు చేసిన ఈ సంఘం వల్ల ఈ ఆరేళ్లలో అనేక ప్రయోజనాలను పొందారన్నారు. ఇందులో భాగంగానే గతేడాది ఎఫ్‌పిఒకు వేరుశనగ పంట అమ్మిన ఉత్పత్తిదారులకు లాభాల్లో 50 శాతం పంచిపెట్టామన్నారు. ఇలాగే ఈ సహకార సంఘంతో మండలంలోని ప్రతి రైతులు లాభాల బాటలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎల్‌ఒ రిజ్వాన, ఎఫ్‌పిఒ శంకర్‌నాయక్, మనోజ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ దంపతులకు సన్మానం

ఉరవకొండ : పాఠశాలను ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కరస్పాండెంట్ రఘురాములు, శ్రీలక్ష్మి దంపతులను శనివారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంతోమంది పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలను విద్యావంతులను చేస్తూ వారి ఎదుగుదలకు కృషి చేస్తున్న రఘురాములు దంపతుల సేవలు ఎనలేనివన్నారు. అనేకమంది పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న వారిని కూడా ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మిత్రులు జిలాన్, మైనుద్దీన్, రామాంజనేయులు, గోపాల్, బ్యాళ్ల ప్రసాద్, శర్మాస్, రఫీ, డిష్ శీనా, తదితరులు పాల్గొన్నారు.

మండల ఆహార సలహా కమిటీ సమావేశం

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆహార సలహా కమిటీ ఛైర్మన్ ఈరమ్మ అధ్యక్షతన శనివారం మండల ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, విడపనకల్ స్టోర్ డీలర్ అసోసియేషన్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, సిఎస్‌డిటి అనంతలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, ఎంఇఒ, నాయకులు కరణం భీమిరెడ్డి పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

గార్లదిన్నె : యువగళం పాదయాత్ర పేరుతో టిడిపి కార్యకర్తలు, యువకులను రెచ్చగొడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని మండల వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేష్ కేవలం యువకులను రెచ్చగొట్టేందుకే పాదయాత్ర చేపట్టినట్లుగా ఉందన్నారు. వెంటనే లోకేష్ అరెస్టు చేసి జైల్లో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జి.గంగాధర్, కో కన్వీనర్లు నాగరాజు, అమరనాథ్‌రెడ్డి, చంద్రాయుడు, శ్రీనివాసులు, జెన్నే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.